# రాష్ట్ర జంతువుకు రక్షణేది?

- మచ్చల జింకల మృత్యుఘోష
- దామగుండం ఫారెస్టులో రక్షణ కరువు
- నేవీరాడార్ రాకతో పెరిగిన మరణాలు
- కుక్కలదాడిలో వరుసగా మృత్యువాత
- కాపాడటంలో స్థానిక సంస్థలు, అటవీ శాఖ విఫలం



హైదరాబాద్, మే18(నమస్తేతెలంగాణ): రాష్ట్ర జంతువు మచ్చల జింకకు రక్షణ లేకుండాపోయింది. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో చీటల్ లేదా మచ్చల జింకలు పెద్ద ఎత్తున మృత్యువాత పడుతున్నాయి. గడిచిన వారంలోనే దామగుండం అడవిలో 6 మచ్చల జింకలు ప్రాణాలు కోల్పోయాయి. అవన్నీ వీధికుక్కల దాడులకు బలవుతున్నాయి. కుక్కల బారి నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తూ అడవిలోని ప్రసిద్ధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో ఆశ్రయం పొందుతున్నాయి. అక్కడ కూడా వీధికుక్కల వేటుకు బలవుతున్నాయి. శనివారం ఆలయ గుండంలో ఒక జింక కళేబరాన్ని గుర్తించారు. అదే ప్రదేశంలో మరొక జింక ప్రాణాలు కాపాడుకునేందుకు తిరుగుతూ కనిపించింది. ఈ విషయంపై ఆలయానికి సమీపంలో ఆశ్రమం నడుపుతున్న సత్యానందస్వామి, కొందరు భక్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. భక్తులు దేవుడిని దర్శించుకోవడానికి ఈ గుడికి వస్తుంటే, జింకలు మాత్రం చనిపోవడానికి వస్తున్నాయని వారంతా ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జింకలు చనిపోతున్నాయని అటవీ అధికారులకు సమాచారం ఇస్తే.. వాళ్లొచ్చి జింకల కళేబరాలను తీసుకెళ్తున్నారే కానీ.. ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవేకాకుండా నాలుగు కొమ్ముల జింకలు, ఇతర జంతు, పక్షి జాతులూ అంతరించిపోతున్నాయని స్థానికులు తెలిపారు.

**కాలనీల చుట్టూ కుక్కల సంచారం**

నేవీ రాడార్ ప్రాజెక్టు కోసం అటవీ ప్రాంతాన్ని పెద్ద ఎత్తున తొలగించిన తర్వాత జింకల మరణాలు పెరిగాయని స్థానికులు చెప్తున్నారు. ప్రాజెక్టు కోసం పని చేస్తున్న కార్మికుల తాత్కాలిక కాలనీల చుట్టూ కుక్కల సంచారం బాగా పెరిగింది. వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాష్ట్ర జంతువును రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, జంతు ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. అటవీశాఖ అధికారులకు సమాచారమిస్తే.. వీధి కుక్కలను నియంత్రించడం తమ పరిధిలోకి రాదని, వాటిని అదుపులో ఉంచాల్సిన బాధ్యత స్థానిక సంస్థలదేనని సమాధానమిస్తున్నట్టు స్థానికులు తెలిపారు. స్థానిక సంస్థలు సైతం వీధికుక్కల నివారణకు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని తెలిపారు. దీంతో ఇంకా మిగిలి ఉన్న మచ్చల జింకలకు ప్రాణహాని పొంచి ఉన్నట్టేనని ఆందోళన వ్యక్తమవుతున్నది.

## నేటి నుంచి దుంప పంటలపై జాతీయ సదస్సు

- రెండు రోజులపాటు కార్యక్రమం
- హాజరుకానున్న ఉద్యాన శాస్త్రవేత్తలు

హైదరాబాద్, మే 18 (నమస్తేతెలంగాణ) : ఆలిండియా కో-ఆర్డినేటెడ్ రిసెర్చ్ ప్రాజెక్ట్ ఆన్ ట్యూబర్ క్రాప్స్(దుంప పంటలు)జాతీయ సదస్సుకు రాజేంద్రనగర్‌లోని ఉద్యానవన కళాశాల వేదికైంది. రాంద్రనగర్‌లోని కూరగాయల పరిశోధన కేంద్రం, తిరువనంతపురంలోని సీటీసీఆర్ఐ సంయుక్త ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో ఈ సదస్సు జరుగనున్నది. దేశంలోని 21 కేంద్రాల్లో పనిచేస్తున్న 50 మంది శాస్త్రవేత్తలు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గత సంవత్సరంలో దుంప పంటలపై చేసిన పరిశోధనలను వివరించడంతోపాటు వచ్చే ఏడాది దుంప పంటల సాగులో చేపట్టనున్న పరిశోధనలపై చర్చించనున్నారు.

## రెండ్రోజులు భాషా అధ్యాపకుల సదస్సులు

### ఉన్నత విద్యామండలి నిర్ణయాలకు వ్యతిరేకంగా..

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయాలకు వ్యతిరేకంగా 19, 20 తేదీల్లో సదస్సులు నిర్వహించాలని భాషా అధ్యాపకులు నిర్ణయించారు. మూడేండ్ల భాషా కోర్సును రెండేండ్లకు కుదించడంతోపాటు 20 క్రెడిట్లను 12 క్రెడిట్లకే పరిమితం చేస్తూ ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకున్నది. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ వంటి భాషా అధ్యాపకులను, కళాశాలల ప్రిన్సిపాళ్లను, భాషా పీఠాధిపతులను సంప్రదించకుండా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నదని భాషా అధ్యాపకులు మండిపడుతున్నారు. సిలబస్ ఖరారు చేసే విషయంలోనూ ఒంటెద్దు పోకడలకు పోతుందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆయా నిర్ణయాలకు వ్యతిరేకంగా సదస్సులు నిర్వహించాలని వారు నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా ఈ నెల 19న ఓయూ వేదికగా ఇంగ్లిష్ భాషపై, ఈ నెల 20న తెలుగు భాషపై అధ్యాపకుల సదస్సు నిర్వహించడం కోసం వారు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ సదస్సుల్లో యూనివర్సిటీలతోపాటు అటానమస్, అనుబంధ ప్రైవేటు కాలేజీలకు చెందిన అధ్యాపకులందరూ హాజరు కానున్నట్టు సదస్సు నిర్వాహకులు ఆచార్య సాగి కమలాకర్ శర్మ తెలిపారు.

## ఆయిల్‌ఫెడ్‌పై అసత్య ప్రచారం తగదు

### ప్రైవేటు కంపెనీలపై ఆయిల్ ఫెడ్ ఫైర్

హైదరాబాద్, మే 18(నమస్తే తెలంగాణ) : పామాయిల్ గెలల కొనుగోలులో రైతులకు ఆయిల్‌ఫెడ్ సంస్థ అధిక ధర చెల్లిస్తున్నదని, దీన్ని అడ్డుకునేందుకు పలు ప్రైవేటు కంపెనీలు ఆయిల్‌ఫెడ్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆ సంస్థ పేర్కొన్నది. ప్రైవేటు సంస్థల అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని సూచించింది. ఆయిల్‌ఫెడ్‌పై దుష్ప్రచారం చేసి రైతుల నుంచి తక్కువ ధరకు పామాయిల్ గెలల కొనుగోలుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపింది. సోషల్ మీడియాలో ఆయిల్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్ సరఫరా చేసిన మొక్కలపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఖండించింది. 19.42% ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో(ఓఈఆర్)తో ఆయిల్‌ఫెడ్ సంస్థ రైతులకు అధిక ధరలు చెల్లిస్తున్నట్టు చెప్పింది. అధిక ధర చెల్లించేందుకు ప్రైవేటు కంపెనీలు ముందుకు రావడం లేదని, అందుకే ఆయిల్‌ఫెడ్ ధరలను తగ్గించేందుకు అసత్య ప్రచారాలకు పూనుకున్నాయని వివరించింది. మూడేండ్ల క్రితం 34,720 ఎకరాల్లో మాత్రమే ఉన్న ఆయిల్ ఫెడ్ పామాయిల్ విస్తీర్ణం, ప్రస్తుతం 1.44 లక్షల ఎకరాలకు పెరిగిందని, ఇదే విషయం సంస్థపై రైతులకు ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తున్నదన్నారు.

## ఏపీలో వేర్వేరు ప్రమాదాల్లో 10 మంది మృతి

- కారు డోర్ లాక్ పడి నలుగురు చిన్నారులు..
- నీటి గుంతలో పడి మరో ముగ్గురు చిన్నారులు మృతి
- బావిలోకి కారు దూసుకెళ్లడంతో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు

హైదరాబాద్, మే 18 (నమస్తేతెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లో ఆదివారం జరిగిన మూడు వేర్వేరు ప్రమాదాల్లో పది మంది మృతిచెందారు. విజయనగరం జిల్లా కంటోన్మెంట్ పరిధిలోని ద్వారపూడి గ్రామంలో కారు లాక్ పడటంతో అందులో చిక్కుకున్న నలుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. సరదాగా ఆడుకునేందుకు కారు లోపలికి వెళ్లిన తర్వాత లాక్ పడటంతో ఊపిరి ఆడక ఉదయ్(8), చారుమతి(8), చరిష్మా(6), మనస్వి(6) మృతిచెందారు. వీరిలో చారుమతి, చరిష్మా అక్కాచెల్లెళ్లు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం దేవరాజపురంలో నీటి గుంతలో పడి మరో ముగ్గురు చిన్నారులు మృతిచెందారు. శాలిని(5), అశ్విన్(6), గౌతమి(8) ఇంటి పునాది కోసం తవ్విన గుంతలో పడి ప్రాణాలు కోల్పోయారు. అన్నమయ్య జిల్లా పీలేరు మండలం బాలమువారిపల్లి వద్ద కారు బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన శివన్న, లోకేశ్, గంగులయ్య, సునీల్, తిప్పారెడ్డి పీలేరులో క్యాటరింగ్ పనులు చేసేందుకు బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున పీలేరు మండలం బాలమువారిపల్లె వ్యవసాయ పొలాల సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పక్కనే ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. సునీల్, తిప్పారెడ్డి ప్రాణాలతో బయటపడగా శివన్న, లోకేశ్, గంగులయ్య మృతిచెందారు. పీలేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 'ఫాల్కన్' కుంభకోణంలో మరో ఇద్దరి అరెస్టు

### సీఐడీ డీజీ శిఖా గోయెల్ వెల్లడి



హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): ఫాల్కన్ కుంభకోణంలో మరో ఇద్దరిని అరెస్టు చేసినట్టు సీఐడీ డీజీ శిఖా గోయెల్ ప్రకటించారు. రబీంద్ర ప్రసాద్ సింగ్ (63), సుస్మరాజ్(31)ను శనివారం అదుపులోకి తీసుకున్నట్టు ఆదివారం వెల్లడించారు. వీరు తెలంగాణ నుంచి బీహార్‌కు వెళ్లి అక్కడే స్థిరనివాసం ఏర్పరచుకున్నారని, ఈ ఇద్దరు నిందితుల నుంచి రూ.8 లక్షల నగదు, 9 మొబైల్ ఫోన్లు, 2 ట్యాబ్‌లు, బ్యాంక్ కార్డులు, చెక్‌బుక్‌లు, ఆస్తి పత్రాలు, పాస్‌పోర్టులు, ఇతర గుర్తింపు కార్డులు స్వాధీనం చేసుకోవడంతోపాటు రూ.లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను సీజ్ చేసినట్టు ఆమె వివరించారు. క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తయారు చేసిన 'ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్' అనే అప్లికేషన్ ద్వారా నిందితులు 7,056 మంది నుంచి రూ.4,215 కోట్లు వసూలు చేసినట్టు సీఐడీ పేర్కొన్నది. వీరిలో 4,065 మందిని రూ.792 కోట్ల మేర మోసగించినట్టు అధికారులు గుర్తించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న 'క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్' సీఈవో యోగేంద్ర సింగ్‌ను ఈ నెల 6న అరెస్టు చేశారు.

## చూపుడు వేలును కొరికేశాడు

- ఊడి కిందపడ్డ మహిళ వేలు
- అతికించలేమన్న వైద్యులు
- చిట్టీ డబ్బు విషయంలో ఘర్షణ

వెంగళరావునగర్, మే 18 : చిట్టీ డబ్బు విషయంలో తలెత్తిన గొడవలో ఓ మహిళ కుడిచేతి చూపుడు వేలిని చిట్టి నిర్వాహకుడు గట్టిగా కొరికేశాడు. దీంతో ఊడిపోయిన వేలిని పట్టుకుని దవాఖానాకు వెళ్లినప్పటికీ.. అతికించలేమని వైద్యులు చెప్పేసరికి హతాశురాలైంది ఆ మహిళ. హైదరాబాద్ మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన సుజిత ఇంట్లోని పెంట్‌హౌజ్‌లో మూడేండ్ల నుంచి మమత అద్దెకు ఉంటుంది. మమత వద్ద ఇంటి యజమానురాలు సుజిత చిట్టీలు వేసేది. మమతకు రూ.30 వేలు చిట్టీ డబ్బులు సుజిత ఇవ్వాల్సి ఉంది. ఇటీవల మమత ఆ ఇంటిని ఖాళీ చేసి తన స్నేహితురాలు సుప్రియకు ఇప్పించింది. వారం రోజుల తర్వాత సుప్రియ ఎవరికి చెప్పకుండా ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయింది. చిట్టీ డబ్బులు వసూలు చేసుకునేందుకు సుజిత ఇంటికి మమత, ఆమె భర్త హేమంత్ వచ్చారు. ఇంటి అద్దె చెల్లించకుండా సుప్రియ వెళ్లిందని.. అద్దె డబ్బు ఇవ్వాలని సుజిత పట్టుబట్టింది. ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. సుజిత తల్లి లత(45) అడ్డురావడంతో ఆమె కుడి చెయ్యి చూపుడు వేలిని హేమంత్ కొరికేశాడు. ఊడిన వేలిని పట్టుకుని దవాఖానాకు పరుగులు తీయగా, ఆ వేలిని అతికించలేమని వైద్యులు తేల్చిచెప్పారు. సుజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హేమంత్‌ను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

## కానిస్టేబుల్ వడ్డీ వ్యాపారం!

- అమాయకుల నుంచి అధిక వడ్డీ వసూలు
- బాకీ కింద ఆస్తుల రిజిస్ట్రేషన్
- గంగాధర్‌పై కేసు నమోదు

వినాయక్‌నగర్, మే 18: వడ్డీ వ్యాపారి అవతారమెత్తిన ఓ కానిస్టేబుల్ అమాయకుల ఆర్థిక అవసరాలను ఆసరాగా తీసుకొని అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడు. చీటీల వ్యాపారం చేస్తూ, సకాలంలో డబ్బులు చెల్లించని వారి ఆస్తులను తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నాడు. నిజామాబాద్ రూరల్ ఎస్సై మహ్మద్ ఆరీఫ్ వివరాల మేరకు.. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత తన కూతురికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో చికిత్స కోసం డబ్బులు అవసరమయ్యాయి. ఈ విషయం మెండోరా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీనియర్ కానిస్టేబుల్ కలివరి గంగాధర్‌కు తెలిసింది. దీంతో కానిస్టేబుల్ గంగాధర్ సదరు మహిళ వద్దకు వచ్చి 'మీ వద్ద ఏదైనా ప్రాపర్టీ ఉంటే నా పేరిట సేల్ డీడ్ చేయండి. డబ్బులు ఇస్తాను' అని నమ్మించాడు. ఆ మహిళ రూ.20 లక్షలు విలువ చేసే ఓపెన్ ప్లాట్‌ను కానిస్టేబుల్ పేరిట సేల్‌డీడీ చేసింది. కానిస్టేబుల్ రూ.8 లక్షలు ఇచ్చి, 5% వడ్డీతో తిరిగి చెల్లించాల్సి ఉంటుందని కండీషన్ పెట్టాడు. ఆ మహిళ సకాలంలో వడ్డీ చెల్లించడం లేదని.. సదరు కానిస్టేబుల్ రికవరీ కోసం పెట్టుకున్న వ్యక్తులను ఆమె ఇంటికి పంపించి వేధించసాగాడు. వీరి వేధింపులు ఎక్కువకావడంతో ఆ మహిళ శనివారం నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ కే గంగాధర్‌పై ఫిర్యాదు చేసింది. దీంతో గంగాధర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఆరీఫ్ తెలిపారు.

## అండర్ వాటర్ డ్రోన్లతో 'శ్రీశైలం' పరిశీలన

హైదరాబాద్, మే 18 (నమస్తే తెలంగాణ): అండర్ వాటర్ డ్రోన్లతో శ్రీశైలం డ్యామ్ దిగువన ఏర్పడిన ప్లంజ్‌పూల్ పరిస్థితిని అధికారులు పరిశీలిస్తున్నారు. సంబంధించిన ఫొటోలను సేకరిస్తున్నారు. శ్రీశైలం డ్యామ్ నుంచి వచ్చే భారీ ప్రవాహానికి స్పిల్‌వే దిగువన 40 మీటర్ల లోతులో ప్లంజ్ పూల్ (భారీ గొయ్యి) ఏర్పడిందని, ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉన్నదని గతంలోనే ఏబీ పాండ్యా కమిటీ హెచ్చరించింది. సత్వరం డ్యామ్ భద్రత పనులను చేపట్టాలని, స్కై జంప్ బకెట్‌కు మరమ్మతులు చేయాలని సూచించింది. ఇటీవల డ్యామ్‌ను సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అతుల్‌జైన్ కూడా ఇదే విషయాన్ని నొక్కిచెప్పారు. శ్రీశైలం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరుపై ఎన్‌డీఎస్‌ఏ ఆందోళన వ్యక్తం చేసింది. స్పిల్‌వే దిగువన ప్లంజ్‌పూల్ మరింత లోతుకు, ఆనకట్ట పునాది వైపునకు విస్తరిస్తున్నదని, ఫలితంగా పునాది నిర్దేశిత గ్రేడ్ కంటే చాలా తక్కువకు పడిపోతున్నదని, వెరసి ఆనకట్ట స్థిరత్వం ప్రమాదకరంగా మారిందని హెచ్చరించింది. తక్షణం రక్షణ చర్యలు చేపట్టాలని మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఏపీ సర్కారు ఎట్టకేలకు స్పందించింది. మరమ్మతు పనులపై కసరత్తు చేస్తున్నది.














